క్లుప్తంగా

కళాశాలలో లిఫ్ట్ ఏర్పాటుకు విరాళం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చెక్కు అందజేస్తున్న ఖాజాపాషా

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లిఫ్ట్ ఏర్పాటుకు శనివారం జేపీ దర్గాకు చెందిన ఎస్‌కేపీ రెడ్ మిక్స్‌ప్లాంట్ యజమాని ఖాజాపాషా రూ.20లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆయన అందజేశారు. పేద విద్యార్థుల సంక్షేమానికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించారు.

తెలంగాణ జాగృతి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడికి సన్మానం



ముస్తఫాను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ జాగృతి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన ఎండీ ముస్తఫాను శనివారం పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, సుధాకర్, రాజు, నస్రీన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల అన్నారు. పట్టణ శివారులోని చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో విశాల, శ్రావణ్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. పూజల అనంతరం స్వామివారి పల్లకిసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోర్డు ఏర్పాటు



దాత రవీందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

షాబాద్: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో దాత రవీందర్‌రెడ్డి బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



మురుగునీటిలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు



ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం!

- ఇళ్ల మధ్యన పారుతున్న మురుగునీరు
- దుర్వాసన, దోమల బెడదతో స్థానికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

పృథ్వీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

నందిగామ: అసలే వర్షాకాలం.. వ్యాధులు విజృంభిస్తున్న సమయం.. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాల్సిన అధికారులు పత్తాలేకుండా పోయారు. ఫలితంగా ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలు.. పొంగి పొర్లుతున్న మురుగు కాల్వలు.. దోమల స్వైరవిహారంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదీ మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పృథ్వీకాలనీలో దుస్థితి.

సమస్యలతో ఉక్కిరిబిక్కిరి

పృథ్వీ కాలనీలో వీధిలో చూసినా చెత్తచెదారాలతో నిండిపోయాయి. వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి మురికి కుంటల్లా మారాయి. దీంతో దుర్వాసన, దోమల బెడదతో కాలనీవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత కొన్ని నెలలుగా పరిస్థితి ఇలానే ఉందని, పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గ్రామ స్థాయి అధికారులకు పదే పదే ఆదేశాలు ఇస్తున్నా కూడా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



కాలనీలో చెత్తాచెదారాలు ఎక్కడ పడితే అక్కడే ఉంటున్నాయి. ఎప్పటికప్పుడూ చెత్త తొలగించాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్య నివారణపై దృష్టి సారించాలి.

– నరేశ్, పృథ్వీకాలనీ

అనారోగ్యానికి గురవుతున్నాం



కాలనీలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగు నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోయాయి. దీంతో దోమల బెడద ఎక్కువై కాలనీ లో చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి.

– వెంకట్‌రాంరెడ్డి, పృథ్వీకాలనీ

చర్యలు తీసుకుంటాం



పృథ్వీకాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని గ్రామ కార్యదర్శికి సూచించాం. కాలనీని సందర్శించి ఎక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటాం.

– తేజ్‌సింగ్, ఎంపీఓ

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో విద్యారంగానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో టీచర్లు, చిన్నారులు, తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో అంగన్‌వాడీలను సందర్శించినప్పుడు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కొన్ని అంగన్‌వాడీలు శిథిలావస్థకు చేరుకోవడం, చిన్నారులు కనీసం కూర్చునేందుకు ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని సొంత నిధులతో కొన్ని అంగన్‌వాడీలలో మరమ్మతులు చేయించామని స్పష్టం చేశారు. బాలల విద్యకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ఆరు మండలాలతో పాటు రెండు మున్సిపాలిటీలకు 28 నూతన అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేసిందని వెల్లడించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచారన్నారు. ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంలో భాగంగా సర్కారు బడులలో విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే నియోజకవర్గంలో అంగన్‌వాడీలను మంజూరు చేసినందుకు పంచాయతీశాఖ, సీఆర్డీఏ, కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నాయకులు వీరేశం, శ్రీధర్‌రెడ్డి, తాండ్రశ్రవణ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు



ఆర్.కృష్ణయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు

షాబాద్: పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శనివారం ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంచి టపాకాయలు కాల్చారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఆర్. కృష్ణయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాజకీయంగా బీసీలను అణగదొక్కేందుకు నాయకులు బీసీలను పావులుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో షాబాద్ మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, యువజన అధ్యక్షుడు బండ అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మీరంపల్లి బాల్‌రాజ్, నాయకులు మల్లేశ్, కుమార్, కృష్ణ, శివకుమార్, ఆనంద్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మంచినీటి సమస్యపై ఆందోళన



హిమాయత్‌నగర్‌లో కాలిపోయిన బోరు మోటార్‌ను చూపిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గత నాలుగు రోజుల నుంచి బోరుమోటార్ పాడవడంతో నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ సర్పంచ్ మంజుల రవియాదవ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్‌లోని మైసమ్మ దేవాలయం వద్ద నాయకులు, మాజీ వార్డుసభ్యులు, స్వచ్ఛంద సంస్థ సంఘాల నాయకులు, ప్రజలు కలిసి ఆందోళన నిర్వహించారు. గత నాలుగు రోజుల క్రితం పాడైన బోరుమోటార్‌ను చూపిస్తూ వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల నుంచి హిమాయత్‌నగర్ గ్రామంలోని ఆయా కాలనీల్లో మంచినీరు కరువైందని ఆరోపించారు. బోరుమోటార్ కాలిపోయి నాలుగు రోజులు అవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులకు ఫోన్‌చేస్తే సమాధానం లేదని సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రామంలో ఉన్న సమస్యలపై ఫిర్యాదు చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు బిస నర్సింహ, మాజీ వార్డుసభ్యులు కుమ్మరి దర్శన్, గ్రామస్తులు బాత్కు రమేశ్, కుమ్మరి శ్రీనివాస్, మోడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌లో జెండా ఎగురవేయాలి

విమోచన కమిటీ రాష్ట్ర కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

నందిగామ: తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17న ప్రతీ బూత్‌లో జాతీయ జెండాను విధిగా ఎగురవేయాలని విమోచన కమిటీ రాష్ట్ర కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నందిగామలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ ఆధ్వర్యంలో శనివారం సేవా పక్వాడా కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన పోరాటంతోనే తెలంగాణకు స్వేచ్ఛ లభించిందన్నారు. సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవంతో పాటు ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. ప్రధాని జన్మదినం సందర్భంగా 75 మంది రక్తదానం చేయాలని, ప్రతీ బూత్‌లో జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ చారి, విక్రాంత్ గౌడ్, మోహన్ సింగ్, అశోక్ గౌడ్, రాజు, సుధాకర్, చెన్నయ్య, హేమంత్ నాయక్, నర్సింహగౌడ్, జంగయ్య, శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్, అశోక్, వజ్రం తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో విఫలం

బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతలా తిప్పలు పడిన పరిస్థితులు గతంలో ఎప్పుడు రాలేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనతో పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం ఆఫీసులు, అధికారుల చుట్టూ, రోడ్లపై బారులు తీరుతున్నారన్నారు. ఎదుగుదలలో వరి, పత్తి పూత దశలో ఉందని యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేశారన్నారు. యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులు కంటినిండా నిద్రపోని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి వారి కష్టాలు తీర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

సొంత నిధులతో వంతెనకు మరమ్మతులు



రేగడిఘనాపూర్‌లో లింక్‌రోడ్డు వాగుపై వంతెనకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు



దాత యువ నాయకుడు విగ్నేశ్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న నాయకులు, ప్రజలు

చేవెళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రేగడిఘనాపూర్‌లో వడ్డెర బస్తీకి వెళ్లే లింక్‌రోడ్డుపై ఉన్న తాత్కాలిక వంతెన తెగింది. దీంతో వడ్డెర బస్తీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు దాత విగ్నేశ్‌గౌడ్ తన సొంత నిధులతో బాగు చేయిస్తానని హామీ ఇచ్చాడన్నీ మేరకు శనివారం వంతెన మరమ్మతులు చేయించి.. రాకపోకలు సాగేలా కృషి చేశాడు. మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించిన దాతను పలువురు అభినందించారు. ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు విడుదల కాగా.. శిలాఫలకం సైతం వేశారని, కానీ పనులు మాత్రం జరగలేదని వడ్డెర బస్తీ ప్రజలు ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. వంతెనకు మరమ్మతులు చేయించడానికి ముందుకొచ్చిన విగ్నేశ్‌గౌడ్‌ను రేగడిఘనాపూర్ నాయకులు, ప్రజలు, రైతులు శాలువాలతో సన్మానించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి ఆయన రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

నిధుల విడుదలపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలం, మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య కృషితో భారీగా హెచ్‌ఎండీఏ నిధులు విడుదల కావటం హర్షణీయమని పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి.. మండల, మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి గాను హెచ్‌ఎండీఏ నిధులు రూ.9.90 కోట్ల నిధులు విడుదల కావటంపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడు లేని విధంగా మండలానికి ఒకేసారి పెద్దమొత్తంలో దాదాపు 10 కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, వీధిలైట్ల ఏర్పాటు పూర్తవుతుందన్నారు. ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, నాయకులు దావల్‌గారి గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, పాండుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, పాండు, జనార్దన్, రాములు, మహిపాల్, శశిధర్, యాదయ్య, విజయ్, శేఖర్, మాణిక్యం, వీరేశం, శంకర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల వారీగా విడుదలైన నిధులు

సీసీరోడ్లు, వీధిలైట్ల కోసం ముడిమ్యాల రూ.45 లక్షలు, ఈర్లపల్లి రూ.55 లక్షలు, కమ్మెట రూ.55 లక్షలు, చేవెళ్లకు కోటి రూపాయలు, ఎన్కేపల్లికి రూ.30 లక్షలు, చనువెళ్లి రూ.55 లక్షలు, పామెనకు రూ.60 లక్షలు, కుమ్మెరకు రూ.15 లక్షలు, మల్కాపూర్‌కు రూ.30 లక్షలు, అల్లవాడకు రూ.15 లక్షలు, ఆలూరుకు రూ.60 లక్షలు, నౌలాయపల్లికి రూ.15 లక్షలు, అంతారంకు రూ.35 లక్షలు, బస్తేపూర్‌కు రూ.15 లక్షలు, దేవరంపల్లికి రూ.25 లక్షలు, గొల్లపల్లికి రూ.15 లక్షలు, ధర్మసాగర్‌కు రూ.15 లక్షలు, లక్ష్మీగూడకు రూ.25 లక్షలు, గుండాలకు రూ.25 లక్షలు, గొల్లగూడకు రూ.35 లక్షలు, హస్తేపూర్‌కు రూ.25 లక్షలు, కౌకుంట్లకు రూ.25 లక్షలు, నాంచేరి రూ.15 లక్షలు, కిష్టాపూర్‌కు రూ.15 లక్షలు, న్యాలటకు రూ.25 లక్షలు, రావులపల్లికి రూ.25 లక్షలు, సింగప్పగూడకు రూ.35 లక్షలు, తలారంకు రూ.25 లక్షలు, మడికట్టుకు రూ.10 లక్షలు, వెంకన్నగూడకు రూ.5 లక్షలు, ఇక్కారెడ్డిగూడకు రూ.5 లక్షలు, సాయిరెడ్డిగూడ రూ.5 లక్షలు, ఖానాపూర్‌కు రూ.5 లక్షలు, మిర్జాగూడకు రూ.5 లక్షలు, రేగడిఘనాపూర్ రూ.5 లక్షలు, దుద్దాగుకు రూ.5 లక్షలు, తంగడపల్లికి రూ.5 లక్షలు, మడికట్టుకు రూ.5 లక్షల చొప్పున నిదులు విడుదలయ్యాయని వారు తెలిపారు.

అధ్వాన రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న రహదారులు
- అడుగడుగునా గుంతలతో వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీ నుంచి వెంకటాపూర్ వరకు ఎనిమిది కిలోమీటర్ల దూరం. సాధారణంగా రోడ్డు బాగుంటే కారు, బైక్‌పై పది నిమిషాల్లో వెళ్లొచ్చు. కానీ ప్రస్తుతం ఈ రోడ్డుపై వెళ్లడానికి సుమారు 40 నిమిషాల సమయం పడుతోంది. ఇదీ ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని రోడ్ల పరిస్థితి.

ఐదేళ్లుగా ఇదే దుస్థితి..

మొయినాబాద్ పరిధిలో ఐదేళ్లుగా రోడ్ల దుస్థితి ఇలానే ఉంది. రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడి వర్షం పడినప్పుడు నీరు నిలిచి ఆ గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. మొయినాబాద్ నుంచి సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ వెళ్లే రోడ్డులో కిలోమీటర్ వరకు అడుగడుగునా గుంతలు ఉన్నాయి. దీంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గుంతలతో వాహనాలు అటూ ఇటూ కదులుతూ చెడిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మొయినాబాద్ నుంచి పెద్దమంగళారం, చందానగర్ రోడ్డు సైతం ఇదే తరహాలో ఉంది. పెద్దమంగళారం సమీపంలో రోడ్డుపై ఇప్పటివరకు చాలా ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా.. నలుగురికి కాళ్లు, చేతులు విరిగి మంచాన పడ్డారు. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ వద్ద సైతం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి రెడ్డిపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. తారు ఎగిరిపోయి గుంతలుపడ్డాయి. ఒక్కోచోట పెద్ద పెద్ద గుంతలు పడటంతో చిలుకూరు బాలాజీ దేవాలయం, ప్రగతి రిసార్ట్స్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

చర్యలు శూన్యం

మున్సిపల్ పరిధిలో రోడ్ల దుస్థితి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గుంతల పడ్డ రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకుండా వదిలేయడంతో నిత్యం వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారుల తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సురంగల్–శ్రీరాంనగర్ రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు



అధ్వానంగా అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ రోడ్డు

గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

షాబాద్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణయ్య అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ పక్వాడ కన్వీనర్‌గా బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదే మహేశ్, కో–కన్వీనర్లుగా రవిగౌడ్, సందీప్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17వ తేదీన ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బూత్ స్థాయి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్, రక్తదానం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యకర్తలు, నాయకులు భాగస్వాములై ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మహేందర్, సురేశ్‌గౌడ్, నరేశ్, మహేందర్ ఉన్నారు.